క్లుప్తంగా

కరపత్రాల విడుదల



నారాయణపేట: విజయదశమిని పురస్కరించుకొని జాతీయ సాహిత్య పరిషత్ నారాయణపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కురుమన్న, శ్రీగిరి పీఠం శ్రీ శివానంద స్వామి, జిల్లా కన్వీనర్ గుడిసె నరసింహ, కార్యదర్శి తాటినర్సప్ప,శ్రీనివాస్‌పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డిని ఓటువేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా అందించడంతోపాటు ఇప్పుడు అధికారంలోకి వస్తే సబ్సిడీపై విత్తనాలు మందులను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, గోవింద్, వెంకట్‌రెడ్డి, రామ్‌రెడ్డి, నరసింహారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

‘పల్లెవెలుగు’ జాడేది ?

- నేటికీ బస్సు సౌకర్యానికి నోచుకోని గ్రామాలు
- సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలు
- పట్టించుకుని పాలకులు, అధికారులు



పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేటు వాహనం (ఫైల్)



గురువాలింగంపల్లికి అందుబాటులో ఉన్న బీటీ రోడ్డు

మాగనూర్: వేగం కన్నా.. ప్రాణం మిన్న, ప్రైవేట్ వద్దు.. ఆర్టీసీలో ప్రయాణం ఎంతో సురక్షితం అనే మాటలు నినాదాలకే పరిమితమవుతున్నాయి. దారులు లేని గ్రామాల విషయాన్ని పక్కనపెడితే.. రవాణా వ్యవస్థ పటిష్టంగా ఉన్న గ్రామాలకు సైతం పల్లెవెలుగు బస్సులు రాని పరిస్థితి మండలంలో నెలకొంది. బస్సులు రాక ఆటోలు, ఇతర వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణం చేయడంతో చాలా వరకు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇది కేవలం బస్సు సౌకర్యం లేకనే ఇలాంటి దుస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు.

పాలకుల పట్టింపు ఏది..?

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించలేదు. మండలంలోని గురువ లింగంపల్లి, తళంకేరి, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి తదితర గ్రామాలకు అందమైన రహదారులు ఉన్నాయి. కానీ, రవాణా సౌకర్యం మాత్రం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వర్కూర్‌కు సైతం బస్సు సౌకర్యానికి నోచుకోవడం లేదు. గతంలో పాలకుల ఒత్తిడి మేరకు కొన్నాళ్లు బస్సులను నడిపినా.. అధికారులు ఆదాయం రావడం లేదనే సాకుతో నిలిపివేశారు. దీంతో పల్లెప్రజలు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం, ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి రావాడనికి చాలా ఆలస్యం అవుతుంది. చివరికి ఆటోలు కూడా అందుబాటులో లేని దుస్థితి నెలకొంది.

సామర్థ్యానికి మించి..

మండల కేంద్రంలోని వివిధ గ్రామాల పరిస్థితి ఇలాగే ఉంటే.. బస్సులేని గ్రామాల ప్రజలు, విద్యార్థులు పరిస్థితి చాలా వరకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటో వాలాలు ఇదే అదునుగా అనుకుని సామర్థ్యానికి మించి ఎక్కిస్తున్నారు. దీని వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. సరైన సమయంలో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చాలామార్లు ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించిన సంఘటనలు లేకపోలేదు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రతీ పంచాయతీకి బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. నేటి సమాజంలో కూడా బస్సు సౌకర్యం లేని గ్రామాలు ఉండటం చాలా బాధకరం. పాలకులు తగు చర్యలు తీసుకుని వెంటనే బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– అశోక్‌గౌడ్, గురువలింగంపల్లి

అదనపు బస్సు నడిపించాలి

ప్రస్తుతం మాగనూర్, కొత్తపల్లి మీదుగా కృష్ణకు వెళ్తున్న బస్సులో విద్యార్థులు సమార్ధ్యానికి మించి ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సులో చోట్లు లేక చాలా మంది విద్యార్థులు ప్రవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రూట్‌లో మరో అదనపు బస్సును నడిపించాలి.

– అశోక్, కొత్తపల్లి

సమస్య పరిష్కరిస్తాం..

మాగనూర్ మండలంలోని ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదనే అంశం మా దృష్టికి రాలేదు. అయితే ఆయా గ్రామాల సర్పంచ్‌లు లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే మేము రూట్ మ్యాప్ చూసి బస్సు సౌకర్యం కల్పిస్తాం.

– లక్ష్మీసుధ, డిపో మేనేజర్, నారాయణపేట

కాంగ్రెస్‌లో చేరిక..

మద్దూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన సర్పంచ్ అనిత హన్మిరెడ్డి, మహిపాల్‌రెడ్డి మంగళవారం కొడంగల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. దుప్పట్‌గట్, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు తిరుపతిరెడ్డి, ఆంజనేయులు, ఖాజీపూర్ కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని పార్టీ చేరినా పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, నర్సింహ, సంజీవ్, రమేష్‌రెడ్డి, శివరాజ్, మాదవరెడ్డి పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన చెన్నారెడ్డిపల్లి సర్పంచ్ హన్మిరెడ్డి

ముగిసిన బతుకమ్మ సంబరాలు



నారాయణపేటలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: బతుకమ్మ వేడుకలు జిల్లా కేంద్రంలో సోమ, మంగళవారాలు ఎంతో ఉత్సాహంగా కొనసాగాయి. చివరిరోజుల్లో మహిళలు, యువతులు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని అక్షయ న్యూట్రిషన్ సెంటర్‌లో చక్కటి బతుకమ్మ పాటలకు దాండియా ఆడారు. అదేవిధంగా శివలింగేశ్వరదేవాలయం నుంచి వీరశైవ మహిళలు భారీ బతుకమ్మతో ర్యాలీగా నృత్యాలు చేస్తు కొండారెడ్డిపల్లి చెరువుకు చేరుకున్నారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

మాగనూర్: మండల పరిధిలోని తళంకేరిలో దసరా ముగింపు ఉత్సవాలను పురష్కరించుకుని పంచాయతీ భవనం వద్ద బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు కాలనీలోని మహిళలు, యువతులు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మను తయారుచేసి ఆట, పాటలతో అలరించారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చిన్నవాగులో నిమజ్జనం చేశారు.

మక్తల్: పట్టణంలోని దసరా ముగింపు ఉత్సవాలను పురష్కరించుకుని మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మను తయారుచేసి ఆట,పాటలతో అలరించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.



కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు..



మాగనూర్‌లో



మక్తల్‌లో



మక్తల్‌లో శమి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



కృష్ణలో..



మరికల్‌లో..

ఘనంగా విజయ దశమి ఉత్సవాలు

నారాయణపేట రూరల్ : పట్టంలోని వివిధ గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గమ్మ తల్లిని వైభవంగా ఊరేగిస్తూ గంగమ్మ ఒడికి చేర్చారు. నవరాత్రులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక వాహనంలో అలంకరించి ప్రధాన రహదారిలో శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున ర్యాలీలో మహిళలు, యువకులు, భక్తులు హాజరయ్యారు. ఒక పక్క మహిళలు, యువతులు కోలాటం, దాండియా, బొడ్డెమ్మలు అడుతుండగా, మరో పక్క యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. దగ్గరలోని చెరువులో నిమజ్జనం చేశారు.

మక్తల్: పట్టంలోని వివిధ గ్రామాల్లో సోమవారం దసరా పండుగ ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. దేవినవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు గ్రామాల్లో ప్రతిష్ఠించి దుర్గాదేవి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు జమ్మి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎంపీపీ వనజ, శ్రీనివాస్‌గుప్తా, ఎంపీపీ వనజ, రాజేష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింహాగౌడ్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజుల ఆశిరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, జిల్లా మత్సశాఖ డైరెక్టర్ కోళ్ల వెంకటేష్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తాయప్ప, కర్నిస్వామి, కావలి వెంకటేష్, భాస్కర్ రెడ్డి, భీంరెడ్డి, సత్యనారాయణగౌడ్, కుర్మయ్య, విజయ్, చంద్రశేఖర్, రవిశంకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, తాయప్ప, కె.నాగప్ప, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కోస్గి: మండలంలోని విజయదశమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, శివాజీ యువజన సంఘంతోపాటు హిందూ సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీ రావణాసురుడి బొమ్మను ఏర్పాటుచేసి దహనం చేశారు. అంతకుముందు కుల సంఘాలు, యువజన సంఘాలు శమివృక్ష కొమ్మలతో ర్యాలీగా మైదానానికి చేరుకొని ప్రత్యేక పూజల అనంతరం ఒకరికొకరు జమ్మి పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మరికల్: మండలంలో విజయదశమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణులు సుందరయ్యశర్మ, మాణిక్యప్రభుశర్మ, వసంత్‌కుమార్‌లు సర్పంచ్ గోవర్ధన్, జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ దంపతులచే జమ్మి వృక్షానికి పూజలు చేయించి దసరా వేడుకలను ప్రారంభించారు. అనంతరం యువక మండలి ఆధ్వర్యంలో రావణ దహనం చేశారు.

మద్దూరు: మండలంలో విజయదశమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కోట్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద, శివాలయం వద్ద మాజీ ఎంపీపీ బర్ల అంజయ్య కుటుంబసభ్యులు శమివృక్షానికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు శమి పంచుతూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సర్పంచ్ అరుణ, ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీటీసీ వెంకటయ్య, బాసుస్వామి, రాఘవేంద్రచారి, మల్లికార్జున్, వెంకట్‌రాములుగౌడ్, రాములుగౌడ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారికి సోమవారం ఆయుధ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని అంబాభవానికి, కున్సిలోని ఉలిగమ్మ ఆలయం వద్ద భక్తులు పూజలుచేసి అన్నదానం నిర్వహించారు.



కోస్గిలో నిర్వహించిన విజయదశమి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

ఊట్కూరు: మండలంలో సోమవారం విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఊట్కూరు, బిజ్వార్, పులిమామిడి, చిన్నపొర్ల, మల్లెపల్లి, తిప్పరాస్‌పల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలుచేసి శమి వృక్షానికి పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, ఆర్యసమాజ్ పవన్‌కుమార్, బాలరాజు, భీంరాజు, నర్సింగప్ప, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం జమ్మిచెట్టు వద్ద పూజ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని దసరా పండగ ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామస్తులు ఊరేగింపుగా బయలుదేరి స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన జమ్మికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అంబాభవాని ఆలయంలో జమ్మికి పూజలు చేశారు.



కోస్గిలో..



నారాయణపేటలో శమివృక్షానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



కృష్ణాలో..



నారాయణపేటలో కోలాటం ఆడుతున్న మహిళలు



ధన్వాడలో..



ఊట్కూర్‌లో..



శివాలయం వద్ద శమికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

విజేతలకు బహుమతుల అందజేత

మరికల్: మండల కేంద్రంలో వారం రోజులపాటు నిర్వహించిన మరికల్ సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన డ్రీమ్–11, ద్వితీయ స్థానం పొందిన శివాజీ–11 టీములకు నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి బహుమతులను అందజేశారు. గ్రామీణ స్థాయిల్లో క్రీడాలను ప్రోత్సాహించేందుకు ఇలాంటి టోర్నమెంట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రాజేష్, రవికిరణ్, సురేష్, శ్రావణ్, చంటి, నవీన్, రఘు, హనీఫ్ పాల్గొన్నారు.



బహుమతులను అందుకుంటున్న విజేతలు

వృథాగా విద్యుత్

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు విద్యుత్‌దీపాలు వెలుగులను విరజిమ్ముతున్నాయి. నిరంతరంగా బల్బులు వెలగడంతో విద్యుత్ వృథావుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలలోని వడ్వాట్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీలో 24గంటల పాటు విద్యుత్‌దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు చూసి, చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో వీధిదీపాలను ఆన్‌చేసి ఉదయం వేళల్లో బంద్ చేయాల్సి ఉన్నప్పటికీ, అధికారులు, విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



ఘనంగా హరలయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న మోచి కులస్తులు

నారాయణపేట రూరల్ : మోచికులస్తుల ఆరాధ్య దైవం హరలయ్య, కళ్యాణమ్మ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మొచివాడలో ఏర్పాటుచేసిన వారి విగ్రహాలను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు శరణప్ప, కోషాధికారి బస్వరాజు, సత్యనారాయణ, సైదప్ప, సూర్యకాంత్, భరత్, గజప్ప, శివ పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు

మాగనూర్: మండల కేంద్రం నుంచి వర్కూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో చాలా చోట్ల కంకర తేలి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే చాలా మంది ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడటంతో గాయలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు జంక్కుతున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి, బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన వర్కూర్ రోడ్డు